

# హైదరాబాద్ వార్త

## సారథి సొసైటీలో ఆక్రమణల కూల్చివేత



ఎర్రగడ్డ సారథి కోపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు.

**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 19, ప్రభాతవార్త :**
జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని సారథి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ప్రభుత్వ స్థలంలో కొందరు కబ్జాదారులు పాగా వేయడంతో ఖైరతాబాద్ మండల రెవన్యూ అధికారులు శుక్రవారం చర్యలు తీసుకుని జేసీబీతో ఆక్రమణలను తొలగించారు. బోరబండ ప్రధాన రహదారిలోని విజేత థియేటర్ ఎదురుగా ఉన్న సారథి సొసైటీ కాలనీలో 1986లో సర్వేనెంబర్ 128బై1లో గల రామరాజు అనే యజమాని 16 ఎకరాలలో ప్లాట్లు చేసి అందరికీ అమ్మేశాడు అందులో రెండు ఎకరాలు పార్కు కోసం స్థలాన్ని ఖాళీగా ఉంచారు. ప్రభుత్వాలు పాట్టాదారులకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్ అనుమతులు కూడా ఇవ్వలేదు. అందువలన కొంత మంది ఇళ్లు కట్టుకోకుండా వారి స్థలాలను ఖాళీగా ఉంచుకున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న కబ్జాదారులు ఖాళీ స్థలాలపై నకిలీ పత్రాలు సృష్టించి అసలైన పట్టాదారులను బెదిరించి ఖాళీ స్థలాలను కబ్జా చేస్తున్నారు. పార్క్ స్థలాన్ని కూడా వదల కుండా నకిలీ పత్రాలతో వాటిని విక్రయించాలని ప్రయత్నిస్తున్నారు. కొంతమంది యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్ చేయించుకున్న స్థలాను కూడా కబ్జాదారులు గుడిసెలు వేసి కబ్జాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ తతంగామంతా జరుగుతుండగానే మళ్లీ కబ్జాదారులు ఏకగంగా పార్క్ స్థలాన్ని కబ్జా చేసి దాదాపు 3 వేల గజాల చుట్టూ గోడను నిర్మించారు. స్థానిక ప్రజల నుంచి ఫిర్యాదలు అందడంతో అదేవిధంగా స్థానిక ప్రజలు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేయటంతో ఖైరతాబాదు మండల రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో సారథి సొసైటీ కాలనీకి సంబంధించిన పార్క్ స్థలాన్ని గుర్తించి కబ్జా జరిగిన స్థలంలో అక్రమ నిర్మాణాలను జేసీబీ సాయంతో కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను మరోసారి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కూల్ కూల్..హాట్ హాట్





జింకల ఎన్ క్లోజర్లో ఫెన్సింగ్‌కు గోనె సంచులు కడుతున్న దృశ్యం..



**హైదరాబాద్ డిసెంబరు 19 ప్రభాతవార్త ;**
సిటీ జనులను చలి వణికిస్తోంది. ఇక మూగ జీవాల సంగతి చెప్పనక్కర్లేదు. శీతల గాలులతో అల్లాడుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు నెహ్రూ జూలాజికల్ పార్కులో యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. జూ పార్కులో 194 జాతులకు చెందిన 2,300 వరకు జంతువులు, పక్షులు ఉన్నాయి. చలికాలం నుంచి మూగజీవాలను కాపాడేలా హీటర్లు, గన్నీ బ్యాగులను అందుబాటులోకి తెచ్చింది. ఎన్ క్లోజర్లలోకి చలి చొరబడకుండా గోనె సం చులను అడ్డంగా కడుతోంది. అంతేగాకుండా చలిని నివారించే.. వేడిగాలి వచ్చేలా హీటర్లు, యూవీ లైట్లు అమర్చారు. తీసుకునే ఆహారంలోనూ పలుమార్పులు చేశారు. పక్షుల కోసం వెదురు బుట్టలు, కుండలు పెట్టారు. ఎన్ క్లోజర్ కింది భాగంలో చల్లగా ఉంటుంది. వెచ్చదనం కలిగించేలా కలప, ఎండుగడ్డి పరిచారు. జంతువులు, పక్షులు గూళ్లలో హీటర్లు, బల్బులు, ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేశారు. మోస్ఆర్ బ్రీడింగ్ సెంటర్‌లోని యానిమల్ హౌస్ బయట ఆకుపచ్చ షేడ్ నెట్ అమర్చారు. శీతాకాలంలో జంతువులను సంరక్షించేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నట్లు జూ పార్కు క్యూరేటర్ జె.వసంత తెలిపారు.



# కొలువుదీరిన 'పుస్తకం'

### -హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రారంభం -తొలిరోజే భారీ సంఖ్యలో సందర్శకులు





**హైదరాబాద్ డిసెంబరు 19 ప్రభాతవార్త ;**
హైదరాబాద్ 38వ జాతీయ పుస్తక ప్రదర్శన శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభమైంది. మంత్రి జూపల్లి కృష్ణారావు, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, రమా మేల్కొటె, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు యాకుబ్, ఆర్.వాసులు తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈనెల 29 వరకు కొనసాగనున్న పుస్తక ప్రదర్శనలో జాతీయ, అంతర్జాతీయ పుస్తక ప్రచురణ సంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. మొత్తం 350 స్టాళ్లు కొలువుదీరాయి.

ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన కొనసాగనుంది. మొదటి రోజే పుస్తక ప్రియులతో సందడి నెలకొంది. వార్త తెలుగు జాతీయ దినపత్రిక, తెలంగాణ పబ్లిషర్స్, విశా లాంధ్ర, నవోదయ, ఎమెస్కో, మంచి పుస్తకం, మిళింద్ పబ్లిషర్స్, నవతెలంగాణ, జైభారత్, రాలయసీమ ఆధ్యాత్మిక వేదిక, బుద్ధం, మానవ హక్కుల వేదిక తదితర పుస్తక ప్రచురణ సంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. బుక్‌ఫెయిర్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

## పండుగల వేళ ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారా..!

### - అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న పోలీసులు



**హైదరాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త**
క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో మోసాల ముప్పు పెరిగిందని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ పండుగల సమయంలో ఆన్‌లైన్ లావాదేవీలు, సోషల్ మీడియా వినియోగం గణనీయంగా పెరగడంతో సైబర్ నేరగాళ్లు దీనిని అవకాశంగా మలుచుకుని అమాయకులను మోసం చేస్తున్నారని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా బహుమతులు, క్యాష్‌బ్యాక్‌లు, బోనస్‌లు, విదేశీ లాటరీలు అంటూ ఆకర్షణీయమైన ఆఫర్లతో ప్రజలను వలలోకి లాగుతున్నారని పేర్కొన్నారు. ఎవరైనా గుర్తు తెలియని నంబర్లు లేదా అనుమానాస్పద సోర్స్‌ల నుంచి వచ్చే కాల్స్, వాట్సాప్ మెసేజ్‌లు, ఈమెయిల్స్, సోషల్ మీడియా లింక్‌లపై క్లిక్ చేయవద్దని పోలీసులు సూచించారు. ప్రాసెసింగ్ ఫీజులు, వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ సమాచారం, ఓటీపీలు అడిగే మెసేజ్‌లను పూర్తిగా నిరక్ష్యం చేయాలని స్పష్టం చేశారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ తమ బ్యాంక్ వివరాలు లేదా ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. ఇదిలావుంటే, నూతన సంవత్సరం వేడుకల పేరుతో నకిలీ పాస్‌లు విక్రయిస్తున్న మోసగాళ్లు కూడా పెరుగుతున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు వెల్లడించారు. న్యూ ఇయర్ పార్టీలు, కచేరీలు, పబ్‌లు, రిసార్ట్స్‌కు సంబంధించిన పాస్‌లను నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ సోషల్ మీడియా పేజీల ద్వారా అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. అలాగే సెలవుల ప్యాకేజీలు, పుణ్యక్షేత్ర యాత్రలు, క్రూయిజ్ టూర్లు, అంతర్జాతీయ ప్రయాణ డీల్స్ పేరుతో కూడా మోసాలు జరుగుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల ప్రజలు ఆన్‌లైన్‌లో ఏదైనా కొనుగోలు లేదా బుకింగ్ చేసే ముందు సంబంధిత వెబ్‌సైట్ ప్రామాణికతను తప్పనిసరిగా పరిశీలించాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద లావాదేవీలు, సైబర్ మోసాలకు గురైనట్లయితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని, లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సైబర్ క్రైమ్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. పండుగల సీజన్‌ను సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వారు సూచించారు.

## ఉప్పుగూడ రైల్వే ట్రాక్ వద్ద చెరువు స్థలాన్ని రక్షించిన హైడ్రా

### - అక్రమ నిర్మాణాల కూల్చివేత - రూ.400.కోట్ల భూమికి కంచె

### - చెరువును అభివృద్ధి చేయాలని వినతులు



ఆక్రమణలను కూల్చివేస్తున్న సిబ్బంది దృశ్యం



హైడ్రా అధికారులతో వాదనకు దిగిన ప్రైవేటు వ్యక్తులు

**చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 19 ప్రభాతవార్త :**
పాతబస్తీ బండ్లగూడ మండలం కందికల్ గ్రామం పరిధిలోని చెరువులో వెలిసిన ఆక్రమణలను భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా అధికారులు శుక్రవారం కూల్చివేశారు. ఉప్పుగూడ లలితా భాగ్ రైల్వేట్రాక్ పక్కన ఉన్న మహ్మద్‌నగర్ టౌన్ సర్వే నెంబర్ 28.బ్లాక్ ఎఫ్, వార్డు నెంబర్ 274 సర్వే నెంబర్ 310/1/2లో సుమారు 9.11ఎకరాల స్థలంలో చెరువు ఉండేది. దానిలో రెండు ఎకరాల స్థలం కబ్జాకు గురైంది. వాటిలో నివాసాలు వెలిశాయి. ఇళ్లజోలికి వెళ్లకుండా మిగిలిన ఏడు ఎకరాల చెరువును కాపాడేందుకు దాని చుట్టూ హైడ్రా అధికారులు కంచెను నిర్మిస్తున్నారు. కబ్జాకు గరైన స్థలంలో వెలిసిన ఆక్రమణలను తొలగించే క్రమంలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు తమది పట్టా స్థలంగా చెప్పుకుంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు వారిని నిలువరించారు. ఏడు ఎకరాల భూమి విలువ మార్కెట్‌లో సుమారు 400.కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు తెలిపారు. కబ్జా చెర వీడిన స్థలంలో హైడ్రా అధికారులు పబ్లిక్ నోటీసు బోర్డుపై ఏర్పాటు చేశారు. కాగా ఆర్.వెంకటేష్ అనే వ్యక్తి సంబంధిత స్థలం తనదని పోరాటం చేస్తున్నాడు. భవానీ నగర్ పోలీసు స్టేషన్‌లో రెవెన్యూ అధికారులు కేసు పెట్టారు. తాను ఈ స్థలాన్ని కొనుగోలు చేశానని పట్టాభిరామిరెడ్డి ఈ వివాదంలో భాగస్వామం అయ్యాడు. ఈ విషయమై అతడు కోర్టులో కేసు వేశాడు. కేసును విచారించిన న్యాయస్థానం కోర్టు సమయాన్ని వృధా చేసినందుకు సదరు వ్యక్తికి కోటి రూపాయల వరకు జరిమానా విధించింది. హైడ్రా అధికారులు చెరువును కబ్జా నుంచి విడిపించినందుకు కుమ్మరివాడి పిఎస్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా కమీషనర్ కెవి.రంగనాథ్‌కు అభినం దనలు తెలిపారు. రెండు వర్గాల ప్రజలు నివసించే సున్నితమైన ఈ ప్రాంతంలో వివాదం లేకుండా చెరువును సమీపంలోని నాలాను అభివృద్ధి చేస్తే కొంత వరకు స్థానిక ప్రజలకు వరద ముప్పు తప్పుతుందన్నారు.

# బెడ్లు ఖాళీ లేవు..కార్పొరేట్ ఆస్పత్రికి పొండి!

### -నిమ్స్ ఆసుపత్రిలో వైద్యం కోసం డాక్టర్ కాళ్ళు మొక్కిన రోగి బంధువులు



**హైదరాబాద్,డిసెంబరు 19 ప్రభాతవార్త :**
'నిమ్స్ ఆస్పత్రి వద్ద హృదయవిదారక ఘటన చోటు చేసుకుంది. వైద్యం కోసం వెళితే వెంటిలేటర్ ఖాళీగా లేదంటూ డాక్టర్ సమాధానం ఇచ్చింది. అడ్మిట్ చేసుకోలేమని వెంటిలేటర్లు ఒక్కటి కూడా ఖాళీగా లేవని చెప్పింది. వేరే ఆస్పత్రికి వెళ్లాలని సూచించింది. దీంతో తమకు ఏమీ తెలియదని దయచేసి వెంటిలేటర్ ఏర్పాటు చేయాలని రోగి బంధువులు డాక్టర్ కాళ్లు పట్టుకున్నారు. అయినా తనను ముట్టుకోవద్దు అంటూ డాక్టర్ సమాధానం ఇచ్చింది'. ఇక్కడికే రావాలా..గాంధీ, ఉస్మానియాకు పోవచ్చుగా..అక్కడ కాకపోతే ఇక్కడికి రావాలి కానీ..అందరూ నిమ్స్‌కు వచ్చేస్తే ఎలా అంటూ ఓ వైద్యుడు ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. అత్యవసర పరిస్థితుల్లో నిమ్స్‌కు వెళ్తున్నారా.. జర ఆగండి..అక్కడ అంత సులువుగా బెడ్లు దొరకవు. అర్ధరాత్రి వేళ ఎవరైనా ప్రాణపాయ స్థితిలో నిమ్స్‌కు వెళితే.. పుణ్యకాలం కాస్తా అక్కడి సిబ్బందిని కాళ్లా వేళ్లా పట్టుకోవడానికే సరిపోతుంది. ఆలోపు ఆరోగి ఊపిరి ఆగిపోతుంది. దవాఖానలోని కొందరు వైద్యులు, సిబ్బంది చర్యలతో రోగుల ప్రాణాలకు వైద్యపరమైన రక్షణ లేకుండా పోతున్నది. తాజాగా నిమ్స్‌లో జరిగిన ఓ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే...కల్వకుర్తికి చెందిన ఒక రోగి అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు బుధవారం అర్ధరాత్రి నిమ్స్ దవాఖానకు తీసుకువచ్చారు. ఎమర్జెన్సీ వార్డు వద్దకు వెళ్లగా, ఆ రోగిని పరిశీలించిన వైద్యులు.. ఇక్కడ బెడ్లు ఖాళీలేవు.. వేరే దవాఖానకు తీసుకెళ్లాలంటూ సలహా ఇచ్చారు. అయితే అక్కడే ఉన్న ఓ డ్యూటీ డాక్టర్ ఫలానా కార్పొరేట్ దవాఖానకు వెళ్లాలంటూ.. చెప్పడంతో ప్రైవేట్ దవాఖానల్లో అడ్వాన్స్ రూపంలో లక్షలు అడుగుతున్నారని, ఆ డబ్బులు కట్టుకోలేకనే నిమ్స్‌కు వచ్చామంటూ రోగి కుటుంబ సభ్యులు కన్నీరు పెట్టుకున్నారు. నిమ్స్‌లో చేర్చుకోవాలంటూ కాళ్లా వేళ్లా పడి బతిమిలాడారు. అయినా కనికరించకుండా ఆ రోగికి వెంటిలేటర్ అవసరం ఉంటుందని, తమ వద్ద వెంటిలేటర్ బెడ్స్ ఖాళీగా లేవని డ్యూటీ డాక్టర్ చెప్పడం గమనార్హం. దీనిపై రోగి కుటుంబసభ్యులు అక్కడి సిబ్బందిని గట్టిగా నిలదీయడంతో ఎట్టకేలకు రోగిని చేర్చుకున్నట్లు తెలిసింది. ఈ ఉదంతాన్ని వీడియో తీసిన బాధితుల బంధువు ఒకరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది.

**అందరికీ బెడ్లు కేటాయించాలంటే కష్టం**
**: డాక్టర్ సత్యనారాయణ**

నిమ్స్ ఎమర్జెన్సీ విభాగంలో వందకు పైగా సాధారణ బెడ్లు, 50 వరకు వెంటిలేట్లు ఉన్న బెడ్లు అందుబాటులో ఉన్నాయి. ఎమర్జెన్సీ విభాగానికి ఒక్కోసారి రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. అలాంటి సమయంలో అందరికీ బెడ్స్ కేటాయించాలంటే కష్టమే. తరచూ ఇలాంటి సమస్య వస్తోంది. బెడ్ల సంఖ్య పెంచాలన్న విషయం యాజమాన్యం పరిశీలిస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఉస్మానియా, గాంధీలకు రిఫర్ చేస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు.

## బిసి బిల్లు పాస్ చేయించే బాధ్యత సిఎం రేవంత్‌దే!

### -రిజర్వేషన్‌లు పెంచిన తర్వాతనే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు నిర్వహించాలి

### -బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



సమావేశంలో అభివాదం తెలుపుతున్న బిసి నేతలు. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ, విక్రమ్‌గౌడ్ తదితరులు

**సైఫాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త:** బిసిల రిజర్వేషన్‌లపై రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపతిముర్మును సిఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షంతో కలిసి బిసి బిల్లును అమోదింపజేయించాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. 21 రోజుల పాటు జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కనీసం 21 నిమిషాల పాటు బిసి రిజర్వేషన్‌లపై చర్చించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పట్టు పట్టకుండా మౌనం వహించారని, అలాగే ప్రధాని నరేంద్రమోదీ సైతం విదేశీ టూర్లతో కాలం వెళ్ళబుచ్చారని ఆయన ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో రేవంత్‌రెడ్డి మూడు రోజులపాటు ఢిల్లీలో ఉన్నప్పటికి రిజర్వేషన్‌ల విషయంపై ప్రధానిపై వత్తిడీ చేసే ప్రయత్నం చేయలేదని, చివరికి ఎఐసిసి నేతలను సైతం ఒప్పించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ప్రభుత్వం బిసి రిజర్వేషన్‌లను 17 శాతంకు తగ్గించనప్పటికి బిసిలు తమ రాజకీయ చైతన్యంతో జనరల్ స్థానాల్లో కూడా పోటీ చేసి 51 శాతం సీట్లు గెలిచారని, ఇది బిసిల విజయమని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిసి వాదం మొదలై సర్పంచ్ ఎన్నికల వరకు రాజకీయ ప్రభంజనం సృష్టించిందన్నారు. బిసిల రిజర్వేషన్‌లను 42 శాతంకు పెంచకుండా ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలకు ప్రభుత్వం వెళితే సహించేది లేదని, రిజర్వేషన్‌లు పెంచిన తరువాతనే ఎన్నికలకు వెళ్ళాలని డిమాండ్ చేశారు. త్వరలో రాష్ట్రంలో బిసిల రథయాత్రను నిర్వహిస్తామని, బిసిలలో సంపూర్ణంగా చైతన్యం తీసుకువస్తామన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర బిసి జెఎసి కన్వీనర్‌గా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన మడత వెంకట్‌గౌడ్‌ను శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర కన్వీనర్‌గా నియమించారు. ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, టి.విక్రమ్‌గౌడ్, నిరంజన్, తారకేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# సినీ ఫక్కీలో డ్రగ్స్ ముఠా ఆటకట్టు...

### -రాయదుర్గంలో ఓ డ్రగ్ సప్లయర్, 5గురు వినియోగదారులు అరెస్టు

### -17.2కిలోల గంజాయి, 3 గ్రాముల ఎండిఎంఏ స్వాధీనం



నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయి, ఎండిఎంఏ డ్రగ్స్

**గచ్చిబౌలి, డిసెంబరు 19 ప్రభాతవార్త**
నగరంలో మరో డ్రగ్స్ సరఫరా ముఠాను పోలీసులు సినీ ఫక్కీలో చేజ్ చేసి పట్టుకున్నారు. కొత్త సంవత్సర వేడుకలు సమీపిస్తున్న తరుణంలో గంజాయి, డ్రగ్స్ రవాణా మీద నిఘా పెట్టిన పోలీసులు మణికొండ ప్రధాన రహదారి మీద మాటు వేసి మరీ ఓ సరఫరాదారుడిని, 5గురు వినియోగదారులను అదుపులోకి తీసుకున్నారు. రాయదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మహారాష్ట్ర నాందేడ్ జిల్లా కిన్‌వాట్ మండలానికి చెందిన సోహేల్ లతీష్ ఖాన్ పఠాన్(29) నగరానికి వచ్చి ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను సులభంగా డబ్బు సంపాదించడం కోసం గంజాయి, డ్రగ్స్ విక్రయించసాగాడు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి నిషేదిత ఎండిఎంఏ, గంజాయిని సేకరించి నగరానికి ట్రైన్ మార్గంలో తరలించాడు. అనంతరం వాటిని గ్రాముల చొప్పున ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేసి ఐటి కారిడార్ పరిధిలో విక్రయించసాగాడు. సోహేల్ లతీఫ్ డ్రగ్స్ దందాపై సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు నిఘా పెట్టారు. గురువారం రాత్రి సోహేల్ లతీష్ కోసం ప్రత్యేక బృందంగా ఏర్పడిన పోలీసులు సినీమా తరహాలో డ్రగ్స్ ముఠాను చేరారు. ఓ కానిస్టేబుల్‌ను మాఫ్టీలో నిఘాకు ఉంచి, మిగిలిన వారు నిందితుల కోసం మాటు వేశారు. ఈ క్రమంలో మణికొండ ప్రధాన రహదారిపై ఉన్న ఆంధ్రాబ్యాంకు సమీపంలో సోహేల్ లతీఫ్ ఉన్నాడని సమాచారం అందుకున్న పోలీసులు ఒక్కసారిగా దాడి చేశారు. దాడి సమయంలో సోహేల్ లతీఫ్‌తో పాటు వినియోగదారులు ఆర్యన్ దీప్ సింగ్(26), మన్‌రాజ్‌సింగ్ వాలియా(26), శుభం ఆనంద్(29), రాబిన్‌సింగ్(24), అజయ్‌కుమార్ సాహో(28)లు సంఘటనా స్థలి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అనంతరం వారి బ్యాగులను తనిఖీ చేయగా, 17.2కిలోల గంజాయి, 3.1 గ్రాముల ఎండిఎంఏ లభించింది. దీంతో నిందితులందరికి డ్రగ్ టెస్టులు నిర్వహించగా పాజిటీవ్ వచ్చింది. దీంతో సప్లయర్ సోహేల్ లతీఫ్‌తో పాటు 5గురు వినియోగదారులను పోలీసులు అరెస్టు చేసి రాయదుర్గం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు నిందితుల మీద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## తల్లి మదలించడంతో బాలిక ఆత్మహత్య

**అత్తాపూర్ డిసెంబర్ 19,ప్రభాతవార్త :** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భూపాల్ నగర్‌లో విషాదం నెలకొంది. కూతురును ఫోన్‌లో ఎక్కువ మాట్లాడవద్దని తల్లి లక్ష్మి మందలించడంతో మనస్థాపానికి గురైన బాలిక (16) ఎవరూ లేని సమయంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వచ్చిన తల్లి ఘటనను చూసి స్థానికులను పిలించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అత్తాపూర్ పోలీసులు బాలిక మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఆర్టీసీ డ్రైవర్‌కు తోటి ఉద్యోగుల సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న డిపో మేనేజర్ హరి

**కూకట్‌పల్లి, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి డిపోలో విధులు నిర్వర్తిస్తూ అకాల మరణం చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఏ. సతీష్ కుమార్ కుటుంబ సభ్యులకు డిపోలో పనిచేస్తున్న ఉద్యోగస్తులు భరోసాను ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. తోటి ఉద్యోగుల ద్వారా వసూలు చేసిన రూ.1,50,000 డిపో అధికారులైన డిపో మేనేజర్ హరి, శ్రీలత చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా డిఎం హరి మాట్లాడుతూ డిపో ఉద్యోగస్తులు స్పందించిన తీరును ప్రశంసిస్తూ ఓదార్చే మనస్సు కన్నా సహాయం చేసే చేతులు మిన్న చెబుతూ సమాజంలోని తోటి వారికి ఆపద వచ్చినప్పుడు మేమున్నాం అనే భరోసానిచ్చే మనసులు నేడు కరువయ్యారని అన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి మానవత్వాన్ని చాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కారణం అయిన ఎం ఐలయ్య, దాసరి లక్ష్మయ్య, పి శేఖర్, అక్బర్, ఎన్ ఆర్ శీను, సాయిలు మిగతా ఉద్యోగస్తులను డిపో మేనేజర్ మనస్ఫూర్తిగా అభినందించారు.

## వెంకటేశ్వర నగర్‌కు చెందిన మహిళలు కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలో చేరిన మహిళలు

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** వివేకానంద నగర్ డివిజన్‌లోని వెంకటేశ్వర్‌నగర్‌కు చెందిన పలువురు మహిళలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయినేని చంద్రకాంత్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ఉమా యాదవ్, నీరజ, లక్ష్మి, మంజుల, వెంకటలక్ష్మి, టీ. మంజుల, యామిని, మంగ, ప్రసన్న గీత, యోగితా, అరుణ కుమారి, పుష్పలత, శిరీష గాయిత్రి, సుధా, భవాని, సునీత, రేణుక శ్రావణి, వనజ కాంగ్రెస్ పార్టీలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు చేతుల మీదుగా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సంజీవ్ రెడ్డి, లక్ష్మి నర్సయ్య, భారతమ్మ తదితరులు పాల్గన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
### : పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ


ఆరెకపూడి గాంధీని కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు

**కూకట్‌పల్లి, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** జగద్గిరిగుట్ట సగర ఉప్పర సంఘం అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నుకోబడిన నూతన కార్యవర్గ సభ్యులు పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీని కలిశారు. ఈ సందర్భంగా అరికెపూడి గాంధీ శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ గాంధీ మాట్లాడుతూ సగర ఉప్పర సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మీరు కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, నాయినేనీ చంద్రకాంత్ రావు, జగద్గిరిగుట్ట సగర సంఘం నూతన అధ్యక్షులు వేముల సుదర్శన్ సాగర్, ప్రధాన కార్యదర్శి భీమయ్యా సాగర్, కోశాధికారి వెంకట రమణ, స్టీరింగ్ సభ్యులు రాములు, శ్రీనివాస్, సత్యనారాయణ, గంగాధర్, దయాసాగర్, రామకృష్ణ, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, బాల్ రాజు, కృష్ణ మురళి, చంద్రశేఖర్, వెంకటేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో నాలుగు డివిజన్లను పెట్టాలని వినతి


మణికొండలో నాలుగు డివిజన్లను ఏర్పాటు చేయాలని సర్కిల్ మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న బిఆర్ఎస్ నేతలు

**నార్సింగి, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** మణికొండ సర్కిల్ పరిధిలో ఉన్న జనాభా దామాషా ప్రకారం నాలుగు డివిజన్లను ఏర్పాటు చేయాలని సర్కిల్ మేనేజర్ శ్రీధర్‌కు బిఆర్ఎస్ నాయకులు వినతిపత్రంను అందజేశారు. శుక్రవారం మణికొండ బిఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్ పుప్పాలగూడకు చెందిన నాయకులతో కలిసి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణికొండలో 90.వేల ఓటర్లు ఉన్నారని, ఈ లెక్కనా నాలుగు డివిజన్లు మణికొండ, నెక్‌నాంపూర్, పుప్పాలగూడ, చిత్రపురి కాలనీ పేర్లతో ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరామన్నారు. అల్కాపూర్ టౌన్‌షిప్, వెంకటేశ్వరకాలనీ, ఈవివి కాలనీ, పాయినార్ కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, గోల్కొండ హిల్స్, బ్లూ ల్యాగూన్, కోహినూర్ విల్లాస్, ఫ్లోటిల్లా, వుడ్ ల్యాండ్‌నస విల్లాలు అనేకం నెక్‌నాంపూర్‌లో ఉన్నాయని, నెక్‌నాంపూర్ డివిజన్‌ను కొనసాగించాలని పేర్కొన్నామన్నారు. నాలుగు డివిజన్లను ఏర్పాటు చేస్తేనే పరిపాలనా సౌలభ్యంగా ఉంటుందని, ఇందుకు అవసరమైన ఓటర్లు ఉన్నారని, మా న్యాయమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని ధన్‌రాజ్ డిమాండ్ చేశారు.

### విదేశీ యువతులతో వ్యభిచారం .. పోలీసుల దాడులు

**గచ్చిబౌలి, డిసెంబరు 19 ప్రభాతవార్త** నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ హైటెకొసిటీలో డ్రగ్స్, వ్యభిచార కార్యకలాపాలు ఎక్కువయ్యాయి. అసాంఘీక కార్యకలాపాలపై పోలీసులు నిఘా పెట్టి ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ఇదే క్రమంలో హైటెకొసిటీ పరిధిలోని కొండాపూర్‌లో విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఇంటిపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కెన్యా దేశానికి చెందిన ముగ్గురు యువతులను, ఓ విటుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొండాపూర్ పరిధిలోని మజీద్‌బండలో గత ఓ అపార్టుమెంటులో ఓ వ్యక్తి ఫ్లాటు అద్దెకు తీసుకొని వ్యభిచారం నిర్వహించసాగాడు. కెన్యా దేశం నుంచి ముగ్గురు యువతులను తీసుకువచ్చి ఫ్లాట్‌లో ఉంచి వ్యభిచారం చేయిస్తున్నాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు గురువారం రాత్రి వ్యభిచార గృహం మీద దాడి చేశారు. ఈ దాడిలో ఓ విటుడు పట్టుబడగా, వ్యభిచారం చేస్తున్న ముగ్గురు కెన్యా దేశ యువతులను అదుపులోకి తీసుకున్నారు. యువతులను రెస్క్యూ హోంకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## నాబార్డ్ రిటైర్ ఉద్యోగుల పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన


నాబార్డ్ రిటైర్ ఉద్యోగుల పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 19 ప్రభాతవార్త :** నాబార్డ్ లో పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగులకు సంబందించిన పెన్షన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నాబార్డ్ కేంద్ర కార్యాలయం ముందు నాబార్డ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.మోహనయ్య, హెచ్ ఆర్.శ్రీవత్స మాట్లాడుతూ నవంబర్ 1, 2017 వరకు పదవీ విరమణ చేసిన నాబార్డ్ ఉద్యోగులందరికీ సవరించిన పెన్షన్ సదుపాయాన్ని అమలు చేయాలనీ, భారత ప్రభుత్వం ఆమోదించిన విధంగా సవరించిన కుటుంబ పెన్షన్‌ను సదుపాయాన్ని, దీనిపై ఉన్న గరిష్ట పరిమితిని తొలగించి, చివరిగా పొందిన జీతంలో 30 గా నిర్ణయించిన విధంగా అమలు చేయాలనీ, గతంలో ఉన్న నిబంధనలను సవరించి, 20 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి పూర్తి పెన్షన్ పొందే సౌకర్యాన్ని కల్పించారు, దీనిని కూడా అమలు చేయాలనీ డిమాండ్ చేసారు. పెన్షన్ మొత్తాన్ని ఉద్యోగి చివరి నెలలో పొందిన జీతం లేదా చివరి 10 నెలల సగటు జీతం వీటిలో ఏది ఎక్కువగా ఉంటే దాని ఆధారంగా నిర్ణయించి పెన్షన్ లెక్కింపు చేయాలన్నారు. పెన్షనర్లు ఎదురుకుంటున్న సమస్యలను పరిష్కరించని పక్షంలో 2026 జనవరి 5 న పార్లమెంట్ ఎదుట ధర్నా , 70-80 ఏళ్ల వయస్సు గల సీనియర్ రిటైరీల ఉపవాస దీక్ష వంటి ఉద్యమాలు చేపట్టడంతో పాటు , నాబార్డ్ ప్రధాన కార్యాలయం, ప్రాంతీయ కార్యాలయం ముందు పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. నాబార్డ్ పెన్షనర్ల ఉద్యమానికి మద్దతుగా సమస్యల పరిష్కారంలో ముందుకు రావాలని కోరారు.

# రూ.22 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం


సి సి రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించిన కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి డిసెంబర్ 19, ప్రభాతవార్త :** గాంధీనగర్ డివిజన్ పరిధిలోని పాత మయూరి థియేటర్ లేన్ లో భాగ్యనగర్ కాంప్లెక్స్ అపార్ట్మెంట్ నుండి మెయిన్ రోడ్డు వరకు రూ: 22లక్షల జి హెచ్ ఎం సి నిధులతో మొదలైన నూతన సి సి రోడ్డు నిర్మాణం పనులను స్థానిక కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులు బిజెపి నాయకులు, స్థానిక అపార్ట్మెంట్ వాసులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం స్థానికంగా వున్న సమస్యలను అపార్ట్మెంట్ వాసులను అడిగి తెలుసుకున్నారు. నూతన స్ట్రీట్ లైట్స్, సివరేజి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుకుని, రోడ్డు నిర్మాణం పనులతో పాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని సుదర్శన్ ఎలైట్, భాగ్యనగర్ కాంప్లెక్స్ అపార్ట్మెంట్ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ గారు, ఇంజనీరింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్ వారి సిబ్బంది, బిజెపి డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, దామోదర్, శ్రీకాంత్ వి ఎస్ టి రాజు, పి.నర్సింగ్ రావు, సురేష్ రాజు, ఆనంద్ రావు, సాయి కుమార్ మరియు స్థానిక అపార్ట్మెంట్స్ అసోసియేషన్ వాసులు ఇ.శ్రవణ్ కుమార్, శేషు, అశోక్ బాబ్జి, జ్యోతి రెడ్డి, అంజన పాల్గొన్నారు.

## మాధవపెద్ది సత్యం విలక్షణ గాయక నటుడు : సముద్రాల వేణుగోపాలాచారి


ప్రఖ్యాత నటుడు జిత్ మోహన్ మిత్ర కు శ్రీ భారతి సత్యం జీవన సాఫల్య పురస్కారం ప్రధానం చేస్తున్న మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, చిత్రంలో పూర్వ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణాచారి, ప్రఖ్యాత గాయకుడూ చింతలపాటి సురేష్ తదితరులు

**చిక్కడపల్లి డిసెంబర్ 19 ప్రభాతవార్త :** వివాహ భోజనంబు, వింతైన వంటకంబు పాట వినని తెలుగు వారు ఉండరని ఆ పాటను పాడిన మాధవపెద్ది సత్యం విలక్షణ గాయక నటుడు అని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై శ్రీ భారతి మ్యూజిక్ అకాడమీ అధినేత, ప్రముఖ గాయకుడు చింతలపాటి సురేష్ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో విఖ్యాత గాయకుడు నటుడు మధవపెద్ది సత్యం 26 వ వర్ధంతి సందర్భం గా ప్రఖ్యాత నటుడు జిత్ మోహన్ మిత్ర కు శ్రీ భారతి సత్యం జీవన సాఫల్య పురస్కారం తో పాటు సంగీత చైతన్య భారతి బిరుదు ప్రదానం జరిగింది. ఇదే వేదిక పై గాయనీమణులు శశికళ, విజయ లక్ష్మి లకు సంగీత భారతి పురస్కారం, మధవపెద్ది సూర్య కుమారి కి ఆదర్శ భారతి పురస్కారం ప్రదానోత్సవం సభ జరిగింది. వేదిక పై సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, ప్రముఖ వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్, నిర్మాత రామ సత్య నారాయణ, సూర్య మీనాక్షి, సంగీత గురువులు రామాచారి, నిర్మాత శోభారాణి తదితరులు పాల్గొన్నారు. తొలుత చింతల పాటి సురేష్ స్వరసారథ్యంలో పాడిన మాధవపెద్ది సత్యం సినీ పాట పాటకు ప్రేక్షకుల ప్రశంస పొందారు వినోద్ బాబు బృందం మధురం గా పాటలు ఆలపించారు.

## ఆసుపత్రులలో పనిచేసే కార్మికులకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎం.డి.యూసఫ్. చిత్రంలో ఎం.నర్సింహ్మా తదితరులు

**సైఫాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పెషెంట్ కేర్, సెక్యూరిటి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనంగా 26 వేలుగా నిర్ణయించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనా కార్యక్రమాలకు సిద్దంగా ఉన్నామని హెచ్చరించారు. శుక్రవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన యూనియన్ రాష్ట్ర విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. గతంలో వైద్య శాఖాధికారులు వేతనాలు పెంచడానికి అంగీరించడం జరిగిందని, ప్రస్తుతం ఇందుకు వ్యతిరేకంగా ప్రకటనలు రావడంతో కార్మికులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. గతంలో జివొ నెంబరు 60 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని టెండర్ ప్రకటన విడుదల చేసిన ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా గత మూడు సంవత్సరాల నుంచి కార్మికుల శ్రమశక్తిని దోపిడీ చేస్తున్నదని, రాబోయే రోజుల్లో 26 వేలు వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా మాట్లాడుతూ తమ యూనియన్ పోరాటాల వల్లనే కార్మికులకు కొన్ని హక్కులను సాధించడం జరిగిందని, రాబోయే టెండర్‌లో కార్మికులకు కనీస వేతనాలు కార్మిక చట్టాల అమలు, కనీస బోనస్ తదితర హక్కుల సాధన కోసం కార్మికులు పోరాటాలు చేసి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. యూనియన్ నిర్మాణంలో భాగంగా జనవరి మాసంలో జిల్లా మహాసభలు, ఫిబ్రవరి 8వ తేదీన వరంగల్‌లో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు లక్ష్మీబాయి, హసీనాబేగం, పి.సురేష్, రమేష్, జయలక్ష్మి పాల్గొన్నారు.

## అభివృద్ధిలో ప్రజల వెంటే మేముంటాం
### : ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు


అవంతినగర్ తోటలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు.

**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజలకు అండగా నిలవడం జరుగుతుందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం మోతీనగర్ ప్రాంతంలోని అవంతినగర్ తోట కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో రూ.20 లక్షల వ్యయంతో షెడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మహేందర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక సంక్షేమ సంఘం అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవంతినగర్ తోట కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో షెడ్డు నిర్మాణ పనులకు స్థానికంగా కొందరు అడ్డుకుంటున్నారని అలాంటి వారి బెదిరింపులకు లొంగకుండా ప్రజలకు సౌకర్యంగా ఉండేలా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. సొసైటీ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడటంతో పాటు అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్నారని అలాంటి సొసైటీని రద్దు చేయాలని స్థానికులు కోరారు. తాను తగిన విధంగా చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. అదేవిధంగా కాలనీలోని పోచమ్మ గుడి దగ్గర కాలనీకి సంబంధించిన ప్రహరీ గోడ శిథిలావస్తకు చేరి కూలిపోవటం జరిగిందని దాన్ని పునర్మించేందుకు స్థానిక కార్పొరేటర్ నిధులతో నిర్మాణం చేపడతామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, సెక్రటరీ సత్యనారాయణ స్వామి, నాగేశ్వర్‌రావు, సుబ్బారావు, నారాయణ, వెంకటయ్య, భిక్షపతి, దత్తాత్రేయతో పాటు వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

## ఉందాబజార్‌లో కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయండి


జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్

**చార్మినార్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** దూద్‌బౌలి ఉందా బజార్‌లో బస్తీ వాసులు సొంత నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ పనులు సకాలంలో నిలిచి పోయాయని కమ్యూనిటి హాల్ భవనాన్ని తొలగించి కొత్త కమ్యూనిటీ హాల్‌ను నిర్మాంచాలని కోరుతూ జిహెఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన కమిషనర్ తక్షణమే చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని స్థలాన్ని పరిశీలించి కొత్త కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని పులిపాటి రాజేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీర్ మహమూద్ అలీ, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు

## మోండా మార్కెట్‌లో ప్లాస్టిక్ దుకాణం దగ్ధం

**కంటోన్మెంట్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** మోండా మార్కెట్‌లోని ఇస్లామియా హై స్కూల్‌కు ఎదురుగా ఉన్నా ప్లాస్టిక్ వస్తువులు అమ్మే దుకాణంలో దగ్ధమైన సంఘటన శుక్రవారం రాత్రి మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం మోండా మార్కెట్‌లోని శ్రీరామ ఎంటర్ ప్రైజెస్ యజమాని దినేశ్ అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా ప్లాస్టిక్ సామాండ్లు, ఇస్తార్ కట్టలు, ప్లాస్టిక్ గ్లాసల వ్యాపారం కొనసాగిస్తున్నాడు. వ్యాపారంలో నష్టం వచ్చిందని గత కొన్ని రోజుల నుంచి ప్లాస్టిక్ దుకాణాన్ని మూసి వేశాడు. షాట్ సర్క్యూట్ కారణంతో ఆ దుకాణంలో మంటలు అంటుకొని చుట్టుప్రక్కలకు వ్యాపిస్తుండగా విషయం తెలుసుకున్న స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి రెండు అగ్నిమాపక వాహనాలతో మంటలను అదుపు చేశారు. దట్టమైన పొగ, మంటలు ఎగిసిపడడంతో విద్యుత్ సరఫర నిలిపి వేసి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

## క్రీడలలో పాల్గొనే విద్యార్థులు విద్యాపరంగా మెరుగ్గా రాణిస్తారు
### -భారత బాడ్మింటన్ క్రీడాకారిణి పద్మభూషణ్ సైనా నెహ్వాల్


బాడ్మింటన్ కోర్ట్ ప్రారంభించి విద్యార్థులతో బాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారిణి పద్మభూషణ్ సైనా నెహ్వాల్

**హైదరాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త** క్రీడలలో పాల్గొనే విద్యార్థులు విద్యాపరంగా మెరుగ్గా రాణిస్తారని భారత బాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్స్ విజేత, పద్మభూషణ్ సైనా నెహ్వాల్ తెలిపారు. గుండ్లపోచంపల్లి, డిఆర్ఎస్ఐఎస్ క్యాంపస్‌లో జరిగిన డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ 23వ వార్షిక క్రీడా పోటీల ముగింపు ఉత్సవాలలో సైనా నెహ్వాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డిజిపి డా.అనిల్ కుమార్, డిఆర్ఎస్ఐఎస్ చైర్మన్ దయానంద్ అగర్వాల్, డైరెక్టర్లు అంజనీకుమార్ అగర్వాల్, సంజయ్‌అగర్వాల్, గర్వ అగర్వాల్, స్పోర్ట్స్ చీఫ్ కోచ్ డా. మురమళ్ళ భరత్ కుమార్, అడ్మిన్ హెడ్ వినోద రంజన్, వైస్ ప్రిన్సిపాల్ పూజ సక్సేనా, హెడ్ ఆఫ్ బోర్డింగ్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ క్యాంపస్ లో కొత్తగా ఏర్పాటు చేసిన బాడ్మింటన్ కోర్ట్ ఆమె ప్రారంభించి విద్యార్థులతో బాడ్మింటన్ ఆడారు. అనంతరం క్రీడా పోటీలలో పాల్గొని విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు ట్రోఫీలు, కప్, సర్టిఫికెట్‌లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాల స్పోర్ట్స్ డే కోసం విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తారని, ఇది విద్యార్థులకు వారి ప్రతిభ, పోటీ స్ఫూర్తి మరియు ఐక్యతను ప్రదర్శించడానికి ఇచ్చే గొప్ప అవకాశం అన్నారు. విద్యతోపాటు క్రీడలు మానవ జీవితంలో ఒక ముఖ్యమైన భాగం అని, అవి వ్యక్తిత్వాన్ని రూపొందించడం, మంచి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం, క్రమశిక్షణ మరియు జట్టుకృషి యొక్క విలువలను బోధించడం చేస్తాయన్నారు. పిల్లలలో క్రీడలు, ఆటలను ప్రోత్సహించడంలో పాఠశాలలు భారీ పాత్ర పోషించాలని, పాఠశాలలు తమ రోజువారీ షెడ్యూల్‌లో క్రీడలను చేర్చి, క్రమం తప్పకుండా క్రీడా పోటీలు, టోర్నమెంట్‌లు నిర్వహించాలని సైనా నెహ్వాల్ కోరారు. డా.అనిల్ కుమార్ మాట్లాడుతూ డిఆర్ఎస్ఐఎస్ యాజమాన్యం క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్ వంటి ప్రతి క్రీడలలో విద్యార్థులకు పాల్గొనేలాచేసి దేశీయ, అంతర్జాతీయ పోటీలకు పంపడం అభినందనీయం అన్నారు. దయానంద్ అగర్వాల్ మాట్లాడుతూ ఏ క్రీడా రంగంలోనైనా శిక్షణ పొందేలా డిఆర్ఎస్ఐఎస్ యాజమాన్యం మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు.

## డివిజన్‌ల పేరుతో కెపిహెచ్‌బి కాలనీని మూడు ముక్కలు చేయొద్దు


గాంధీ విగ్రహం దగ్గర నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి డివిజన్ల తాజా పునర్విభజనలో భాగంగా ఆసియా ఖండంలోనే అతిపెద్ద కాలనీగా పేరొందిన కేపిహెచ్బి కాలనీని విభజించి మూడు ముక్కలు చేయవద్దు అని కెపిహెచ్బి కాలనీ మొదటి రోడ్డు గాంధీ బొమ్మ దగ్గర కెపిహెచ్‌బి కాలనీ వాసులు శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు. కాలనీ రోడ్డు నెంబర్ ఒకటి నుంచి కల్వరి టెంపుల్ వరకు కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ అని, బాలాజీ నగర్ డివిజన్ అని, వసంత నగర్ డివిజన్ అని మూడు ముక్కలుగా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 46 సంవత్సరముల క్రితం ఆవిర్భవించిన కెపిహెచ్‌బి కాలనీ అస్తిత్వం కోల్పోతుందని అలా కాకుండా కెపిహెచ్‌బి కాలనీ రోడ్ నెంబర్ 1 నుంచి జేఎన్టీయూ రోడ్డు వరకు కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ 1గా, జేఎన్టీయూ రోడ్డు నుంచి కల్వరి టెంపుల్ ముందు రోడ్డు వరకు కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ 2గా చేయాలని కాలనీవాసులందరూ ముక్తకంఠంతో కోరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు కట్టా నరసింగరావు, కొల్లా శంకర్, షేక్ సత్తార్, జె ఎస్. నారాయణరావు, రాచకొండ భాస్కర్, ముప్పాళ్ళ సాంబశివరావు, గాలి బాలాజీ, శరత్ బాబు, షేక్ మహబూబ్, అకనంబట్టు కుమార్ రెడ్డి, ఎలమంచిలి వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు, అట్లూరి దీపక్ చౌదరి, ప్రసాద్, అంజి, గోవర్ధనాచారి, ఆర్కే చౌదరి, పట్లోళ్ల సాయినాథరెడ్డి, తులసి రెడ్డి, ఆర్ వి సత్యనారాయణ, మదన్, వెంకట్ రెడ్డి, నాగిరెడ్డి, నంద్యాల రవి, నరసింహులు, శ్రీనివాస్, తమ్మినేని ప్రవీణ్ కుమార్, గంధం కరుణాకర్ నాయుడు, కొక్కిలగడ్డ ఫణికుమార్, దొడ్డి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. కూకట్పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ఈ కార్యక్రమానికి వచ్చి సంఘీభావాన్ని తెలియజేశారు.

## అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి : జంపనప్రతాప్


1వ వార్డు బాపూజీ నగర్‌లో అన్నదానం చేస్తున్న జంపనప్రతాప్, నవకాశ్ బాంటియా తదితరులు

**కంటోన్మెంట్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని న్యూ బోయిన్‌పల్లి బాపూజీ నగర్ శ్రీదేవీ నల్లపోచమ్మ, చిన్నతోకట్ట కట్ట మైసమ్మ ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని బారీ ఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ పౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాశ్ బాంటియా, ఆలయ కమిటీ సభ్యులు అజిత్ కళ్యాణ్, నర్సింహ్మా, శ్రీకాంత్, రామారావ్, క్రిష్ణ, అరుణ్ యాదవ్, జాజుల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో మజ్దూర్‌సభ, లోక్ జనశక్తి పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం : సురేందర్

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 19 ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్రంలో జనశక్తిమజ్దూర్‌సభ లోక్‌జనశక్తి పార్టీని బలోపేతం చేయటంతోపాటు కార్మిక సమ స్యల పరిష్కారానికి శక్తివంచనలేకుండా కృషిచేస్తామ ని తెలంగాణ జనశక్తి మజ్దూర్‌సభ, లోక్‌జనశక్తి పార్టీ, లేబర్ సెల్ అధ్యక్షులు సురేంద ర్ అన్నారు. తెలంగా ణ జనశక్తి మజూ ధుతర్ సభ లోక్‌జనశక్తి లేబర్ సెల్ తెలంగాణ కార్యవర్గ సమావేశాన్ని భెల్‌లో నిర్వహిం చారు. ఆ పార్టీ నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌ను, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బుక్క అజయ్ కృష్ణ, హనుమకొండ జిల్లా అధ్యక్షునిగా పసునూరి రఘును నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర జనశక్తిమజ్దూర్ సభ, రాష్ట్ర అధ్యక్షులు సురేంద ర్ వెల్లడించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ..త్వరలో జనశక్తి మజ్దూర్ సభ రాష్ట్ర కమిటీ పూర్తిస్థాయి నియామకాలు జరుతాయని ,అదే విధంగా మిగతా జిల్లాల్లో కూడా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తెలం గాణ రాష్ట్రంలో లక్షలాది మంది కుటుబాలు కాంట్రాక్టు అనే ఒక ముసుగులో వారి శ్రమను ప్రభుత్వ, ప్రైవే టు రంగ సంస్థలు దోచుకుంటు న్నారని, వాటికి వ్యతి రేకంగా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఆ యా పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు రావడంలేదని ఆయన ఆందోళన చెందారు. కాంట్రాక్టు కార్మికులకు 30వేల జీతం ఇచ్చేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నా రు. నూతన పదవీబాధ్యతలు చేపట్టిన కార్మిక నాయకులు కార్మికుల సమస్యలపై పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఇల్లు కొనడం కల జూదమా ?
### హెచ్ఆర్‌సిఎస్ ఇండియా ఉచిత వెబినార్

**నాంపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** హైదరాబాద్ కేంద్రంగా 21 సంవత్సరాలకుపైగా అనుభవం కలిగి రేరా ధృవీకృత సంస్థ హెచ్ఆర్‌సిఎస్ ఇండియా ఆధ్వర్యంలో ఇల్లుకొనడం కల-జూదమా అనే అంశంపై ఉచిత వెబినార్ నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక సీఈఓ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. హైడ్రా కూల్చివేతల భయం పెరిగి కొనుగోలుదారుల్లో గందరగోళం, హైడ్రా చేపట్టిన కూల్చివేతలు రియల్ ఎస్టేట్ రంగంలో తీవ్ర ఆందోళనకు దారితీస్తున్నాయి. కొనాలనుకున్న ఇల్లు, ఫ్లాట్, భూమి ఎఫ్ఎల్‌టి, సరస్సు బఫర్‌జోన్ పరిధిలో ఉందా లేదా అనే విషయంలో అనేకమంది పౌరులకు స్పష్టత లేకపోవడంతో ఏ ఆస్తిని కొనాలి, నివారించాలో తెలియక కొనుగోలుదారులు అయోమయంలో ఉన్నారు. ప్రజల్లో ఈ అవగాహన లోటును పూడ్చేందుకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు నగరాలపై దృష్టిసారిస్తూ పారదర్శకతమైన, నమ్మకమైన, పూర్తిగా ఉచిత సమాచారాన్ని అందించడమే ఈ వెబినార్ లక్ష్యమని హర్షవర్ధన్‌రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. 20 శనివారం రాత్రి 7గంటల నుండి జరిగే ఈ వెబినార్‌కు అందరూ పూర్తి ఉచితం హాజరుకావచ్చని, అయితే ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరని, మరిన్ని వివరాలకు 9704004000లో సంప్రదించవచ్చునని సంస్థ తెలిపింది. ఈ ఉచిత వెబినార్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## స్కూల్ వ్యాన్ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు...

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రాండంగా కొన్ని స్కూలు వ్యాన్ డ్రైవర్‌లకు అకస్మాత్తుగా డ్రంకెన్ డ్రైవ్ టెస్టలు నిర్వహించారు. స్కూలు బస్, స్కూల్ వ్యాన్ డ్రైవర్‌లకు కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి పాఠశాలలకు సంబంధించిన బస్సులను వ్యాన్లను ఇతర వాహనాలను నడపవద్దని అలా చేస్తే సదరు డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ హెచ్చరించారు.

## ఖాతాదారుల నమ్మకాన్ని నిలబెడతా : వైస్ చైర్మన్


ఏపి మహేష్‌బ్యాంకు వైస్ చైర్మన్ నియమితులై గోవింద్ రాఠిని సన్మానిస్తున్న దృశ్యం

**గోషామహల్, డిసెంబర్ 19ప్రభాతవార్త:** ఏపి మహేష్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్‌గా బ్యాంకు డైరెక్టర్‌గా గెలిచిన గోవింద్ నారాయణ్‌రాఠి నియమితులయ్యారు. ఇటీవల ఏపి మహేష్ బ్యాంకుఎన్నికల్లో గోవింద్‌రాఠి బ్యాంకు డైరెక్టర్‌గా విజయం సాధించిన విషయం తెలిసిందే. వైస్ చైర్మన్‌గానియమితులైన గోవింద్‌రాఠిని నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ మహిళా మండలి అధ్యక్షురాలు ఎ.అనిత శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసిలో విలీనమైన మున్సిపాలిటీలకు 24శాతం ఇంటి అద్దె అలవెన్స్, సిసిఎ అమలు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**నిజాంపేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త** మేడ్చల్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ మను చౌదరిని శుక్రవారం కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జిహెచ్ఎంసిలో విలీనమైన మున్సిపాలిటీలకు 24శాతం ఇంటి అద్దె అలవెన్స్, సిసిఎ అమలు చేయాలని అలాగే జిహెచ్ఎంసి పరిధి నుండి 8 కిలోమీటర్ల వరకు వచ్చే గ్రామాలకు, మున్సిపాలిటీలకు 24శాతం హెచ్ఆర్ఏ అమలు చేయాలని టీఎస్ యుటిఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి తరపున ప్రాతినిధ్యం చేయడం జరిగింది. జిహెచ్ఎంసి పరిధిలో కలిసిన ప్రాంతానికి తొందరలోనే సిసిఎ అమలు అవుతుందని కలెక్టర్ ప్రస్తావించారు. ఈ ప్రాతినిధ్యం చేయడంలో జిల్లా అధ్యక్షులు కె.జయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.మదన్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు ఎన్. మహిపాల్ రెడ్డి, సత్యనారాయణ, పురుషోత్తం, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ అదృశ్యం


అదృశ్యమైన హెడ్ కానిస్టేబుల్ హిరాజీ

**సంజీవరెడ్డినగర్, డిసెంబరు 19, ప్రభాతవార్తః** విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ అదృశ్యమైన సంఘటన ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. ఎస్సార్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. సనత్‌నగర్ బీకేగూడ సమీపంలోని శ్రీరాంనగర్‌లో విశ్రాంత హెడ్‌కానిస్టేబుల్ గోంగ్లే హిరాజీ(61) తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. గత నెల 18న సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. అలా వెళ్లిన ఆయన ఇంటికి తిరిగిరాలేదు. ఇంటికి తిరిగి వస్తాడని భావించినప్పటికి తిరిగి రాకపోవడం, బంధువులను, స్నేహితులను విచారించినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో ఆయన కుమారుడు విశ్వత్‌సేన ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా తన తండ్రి గత కొంత కాలంగా జ్ఞాపకశక్తిని కోల్పోయారని, స్థిమితంగా లేరని, సెల్‌ఫోన్‌ను సరిగా ఉపయోగించలేరని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సార్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## హయత్ భక్షి మసీదును హయత్‌నగర్ డివిజన్‌లోనే ఉంచాలి




హయత్ భక్షీమసీదు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

**హయత్ నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజనలో భాగంగా నాలుగు శతాబ్దాల చరిత్ర కలిగిన హయత్ భక్షి మసీదును హైకోర్టు కాలనీ డివిజన్‌లో కలపడంపై శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హయత్ భక్షీ మసీదు వద్ద ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ... హయత్ నగర్ డివిజన్ ను నాలుగు చిన్న డివిజన్లుగా విభజిస్తూ డ్రాఫ్ట్ నోటిఫి కేషన్ జారీ చేయడం ఏకపక్ష నిర్ణయమన్నారు. చారిత్రాత్మక హయత్ బక్షీ మసీదును హయత్ నగర్ డివిజన్ లోనే కొనసాగిస్తూ అధికారులు ప్రజల అభిప్రాయాలను సైతం పరిగణలోకి తీయనుకోవాలన్నారు. దీనిపై ఇప్పటికే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ కార్యాలయంలో అభ్యంతరం లేవనెత్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ గౌడ్, గుడాల మల్లేష్, భాస్కర్ సాగర్, గొరిగె ప్రదీప్, బోడ బిక్షపతి, దీపావళి శ్రవణ్, గుత్త లక్ష్మారెడ్డి, స్కైలాబ్ పాల్గొన్నారు.

## సలీం నగర్‌లో కలుషిత మంచినీటి సరఫరా

**-ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు**
**-పట్టించుకోని జలమండలి అధికారులు**



కలుషిత మంచినీరు సరఫరా అవుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

**మలక్ పేట, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** మంచినీటి సరఫరాలో కలుషిత నీరు కలిసి సరఫరా అవుతుండడంతో స్థానిక ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. సలీంనగర్ ప్రాంతంలో కొద్దిరోజుల నుంచి కలుషిత మంచినీరు సరఫరా అవుతుందని స్థానిక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కలుషీత మంచి నీరు సరఫరా అవుతోందని సంబంధిత జలమండలి అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని స్థానిక ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత మంచినీటి సరఫరా మూలంగా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత జలమండలి మేనేజర్ వెంకటేష్, వర్క్ ఇన్స్పెక్టర్ల దృష్టికి తీసుకువచ్చినప్పటికి వారు నిరక్ష్యంగా వ్యవ హరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే సంబంధిత జలమండలి అధికారులు స్పందించి కలుషీత మంచినీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## డ్రైనేజీ పనులను త్వరలోనే పూర్తి చేస్తాం



నిలిచి పోయిన డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

**హయత్ నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** అధికారులతో కొట్లాడైనా ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని మన్సురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్ లో భాగంగా ఆయన శుక్రవారం మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ పరిధిలోని శ్రీ కృష్ణ హిల్స్ కాలనీలో కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులు రాయి పొర అడ్డు రావడంతో తాత్కాలికంగా నిలిచి పోయాయని తెలిపారు. సంబంధిత జలమండలి అధికారులకు ఫోన్ చేసి పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టిమేషన్ పూర్తయిన సీ.సీ రోడ్ల పనులకు టెండర్ ప్రక్రియ ప్రారంభించి నూతన సీసీ రోడ్లను సైతం త్వరలోనే పూర్తి చేస్తానని తెలిపారు. కాలనీలోని పార్క్ స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణం కూడా చేపడ తామన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు ఎస్.నర్సింహ్మా యాదవ్, ఆర్.వెంకటేశ్వర్లు, క్రాంతి నాయక్, బసవ రెడ్డి, యాదగిరి, రాంరెడ్డి పాల్గొన్నారు.

## డివిజన్ల సరిహద్దులను నిర్ణయించడంలో జిహెచ్ఎంసి అధికారులు విఫలం: అందెల



అధికారుల తీరును తప్పుపడుతున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** పునర్విభజన జరిగిన జిహెచ్ఎంసిలో డివిజన్ల సరిహద్దులను నిర్ణయించడంలో అధికారులు విఫలం అయ్యారని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్ విమర్శించారు. 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు విలీనం చేసి జిహెచ్ఎంసి పరిధిని విస్తరించి పాత, కొత్త కలిపి మొత్తం 300 డివిజన్లు చేసిన అధికారులు సరిహద్దులను మాత్రం సరిగ్గా చేయలేదని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో జిహెచ్ఎంసి పట్టణ ప్రణాళిక విభాగం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. అఖిల పక్ష సమావేశాలు నిర్వహించకుండానే ప్రజల సూచనలు తీసుకోకుండానే ఏకపక్షంగా చేశారనీ అయితే డివిజన్ల వారీగా మ్యాప్‌లను వెల్లడించాలని హైకోర్టు ఆదేశిస్తే అధికారులు బహిర్గతం చేసిన డివిజన్ల మ్యాప్‌లు వారి అనుభవరాహిత్యానికి అద్దం పట్టాయని ఆయన ఎద్దేవా చేశారు. ఓటర్ల సంఖ్య, ఏ డివిజన్‌కు ఎంత ఉండాలనే దానిపై అధికారులు సక్రమంగా నిర్ణయించలేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని డివిజన్ల హద్దులు సరిచేయాలని శ్రీరాములు యాదవ్ అధికారులను కోరారు.

## అండాల్ నిలయంలో కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



శ్రీ అండాలయంలో ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీమాన్ దరూరి రామానుజాచార్య స్వామివారు, చిత్రంలో లక్ష్మీదేవి, రూపా దేవి

**మలక్ పేట, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** ముసారాంబాగ్ లోని శ్రీ అండళ్ నిలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్దలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు లక్ష్మీదేవి మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం అయినా ధనుర్మాస ఉత్సవాలను జనవరి 14వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు .పేర్కొన్నారు. ధనుర్మాస ఉత్సాలలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీ మాన్ ధరూరి రామానుజాచార్య స్వామి వారితో ప్రవచన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. డిసెంబర్ 30వ తేదీ మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా దర్శనం, జనవరి 2వ తేదీ శుక్రవారం ఉందు మద గళిత్త పాశురం పై ప్రవచనము, సాయంత్రం సౌభాగ్యవతులైన శ్రీ అండాళ్ నిలయం భక్తులకు శ్రీ ఆండాళ్ నిలయం నిర్వాహకులతో పసుపు, కుంకుమ, గాజులు, తాంబూలం వితరణ కార్యక్రమం, అదేవిధంగా తిరుప్పావై ఒక ప్రత్యేక నేపద్య కచేరి, 5వ తేదీ సోమవారం ఖిఏట్రాకలంగల్ఖి పాశురం, మాతృశ్రీ రిందా దేవి తిరునక్షత్రం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం, రాత్రి 7:30 గంటలకు రిందా శరణ్య నాట్యమండలి శ్రీమతి యశోద వారి బృందం నాట్య ప్రదర్శన, 8వ తేదీ గురువారం అండాళ్ నిలయంలో దీపోత్సవం, స్వామి, అమ్మవార్లకు కర్పూర నీరాజనం, మంగళ శాసనం, 11వ తేదీ ఆదివారం ఉదయం అండాళ్ తల్లికి నీరాటోత్సవం, అనంతరం 108 గంగాలములతో అక్కార వడిశల్ విశేష ప్రసాద నివేదన వితరణ కార్యక్రమం, 14వ తేదీ బుధవారం భోగి పండుగ, గోదా కళ్యాణం, సాయంత్రం తిరుప్పావై ఫల శృతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## వైభవంగా అయ్యప్ప మహాపడి పూజోత్సవం



అయ్యప్ప పడి పూజను నిర్వహించిన సరూర్‌నగర్ మాజీ ఎంపిపి సామల రంగారెడ్డి: చిత్రంలో ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్‌రెడ్డి, అజయ్‌రెడ్డి తదితరులు ఉన్నారు

**సరూర్‌నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని బాలాపూర్ ఆర్‌సిఐ రోడ్డులో నున్న సామల పాపిరెడ్డి (ఎస్‌పిఆర్) కన్వెన్షన్‌లో శుక్రవారం శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజ వైభవంగా జరిగింది. పూర్వ సరూర్‌నగర్ మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షుడు, బాలాపూర్ గ్రామ మాజీ పోలీస్ పటేల్ సామల రంగారెడ్డి ఆధ్వర్యంలో పడి పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పరమ శివుని భారీ విగ్రహం ముందు సర్వాంగ సుందరంగా అలంకరించిన వేదికపై పద్దెనిమిది మెట్ల సన్నిధానంలో ప్రతిష్టించిన అయ్యప్ప స్వామికి సామల రంగారెడ్డి, ఆయన సతీమణి సామల వినోద, కుమారులు సామల ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ సామల నవీన్‌రెడ్డి, సామల అజయ్‌రెడ్డితో పాటు పలువురు కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహా గురుస్వామి వంగేటి ప్రభాకర్‌రెడ్డి, జూకంటి సురేష్‌గౌడ్ గురుస్వాములు, పూజారి భార్గవశర్మ వారందరిచే పూజాదికాలు నిర్వహించడంతో పాటు అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహానికి పంచామృత అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించారు. 17 సార్లు పాదయాత్రలతో శబరిమలై వెళ్ళి స్వామిని దర్శించుకున్న బాలాపూర్ కొలను జగన్‌రెడ్డి గురుస్వామి బృందం భజనల మధ్య అయ్యప్ప పడి పూజోత్సవం భక్తితన్మయత్వంతో సాగింది. మహా గురుస్వామి వంగేటి ప్రభాకర్‌రెడ్డి సామల రంగారెడ్డి, ఆయన కుమారులచే పడి వెలిగించారు. అనంతరం మహా హారతితో పూజ ముగిసింది. ఆ తర్వాత అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప పడి పూజోత్సవంలో సామల వినోద రంగారెడ్డి, సామల జయలక్ష్మి జనార్ధన్‌రెడ్డి, సామల సాయిప్రియ ప్రవీణ్‌రెడ్డి, సామల స్పందన నవీన్‌రెడ్డి, సామల వైష్ణవి అజయ్‌రెడ్డి, పావని కృష్ణారెడ్డి, సామల శ్యమంత హన్మంత్‌రెడ్డి, పులుసాని ప్రతాప్‌రెడ్డి, సింగిరెడ్డి శంకర్‌రెడ్డి, బుసిరెడ్డి, పాండురంగారెడ్డిలతో పాటు సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డి బ్యాటరీ శ్రీశైలంరెడ్డి, తూళ్ళ బాలాగౌడ్, నిమ్మల విష్ణుగౌడ్, రాజశేఖర్, శివ, శ్రీ లక్ష్మీ కన్వెన్షన్స్‌కు చెందిన సూరిశెట్టి శ్రీనివాస్‌గుప్త, శశిగుప్త, పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని రక్షించిన ఫారెస్ట్ అధికారులకు సన్మానం



ఫారెస్ట్ అధికారిని శాలువాతో సన్మానిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం డిసెంబర్ 19,ప్రభాతవార్త :** సాహెబ్ నగర్ కలాన్ రెవెన్యూ పరిధిలోని 201/1 సర్వే నెంబర్ లో ఉన్న 102 ఎకరాల భూమి గుర్రం గూడా రిజర్వ్ ఫారెస్ట్ లోని భాగమేనని సుప్రీంకోర్టు తీర్పునిచ్చి నందుకు శుక్రవారం బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించినందుకు గుర్రంగూడా లోని అటవీ శాఖ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యత అధికారులదేనని అన్నారు మరియు ఇట్టి ఫారెస్ట్ భూమిలో కొంత భాగం ప్రజల ఆరోగ్యం కోసం అభివృద్ధి చేయాలని అందులో నూతన పార్కును వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట పరికరాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సంబంధించిన అటవీశాఖ అధికారులను కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించిన అటవీశాఖ అధికారులు వీలైనంత త్వరగా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పార్కును ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కస్నా నాయక్, బి.యన్.రెడ్డి నగర్ కాలనీ అధ్యక్షులు, పురుషోత్తం రెడ్డి, వైదేహి నగర్ కాలనీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, చైతన్య నగర్ కాలనీ అధ్యక్షులు సంజీవరెడ్డి, మాజీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, దేవి పోచమ్మ ఆలయ చైర్మన్ ప్రదీప్ రెడ్డి మరియు తదితరులు ఉన్నారు.

## ఇంటి యజమాని, అద్దెకు ఉండే వ్యక్తుల మధ్య గొడవ..!

**యజమానిపై పోలీసు కేసు .. అనుమానాస్పదస్థితిలో మృతి**



సంఘటనా స్థలం వద్ద వివరాలు తెలుసుకుంటున్న సిఐ భాస్కర్, ఇతర అధికారులు

**ఉప్పల్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** ఇంటి యజమాని, అద్దెకు ఉండే వ్యక్తుల మధ్య జరిగిన గొడవ చిలికి చిలికి గాలి వానలా మారి ఒక వ్యక్తి మరణానికి కారణమైంది. ఉప్పల్ పోలీసులు ఒకరిపై కేసు నమోదు చేయడం, యజమానిని స్టేషన్‌కు రావాలని చెప్పడంతో అతను శుక్రవారం మృతి చెందారు. అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్న ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో స్థానిక ఎస్ఐ వేధింపులే యజమాని రాకేష్ రెడ్డి మృతి చెందారని ఆరోపిస్తూ పలువురు అపార్ట్‌మెంట్‌వాసులు ఆందోళనకు దిగారు. దీంతో శుక్రవారం అపార్ట్‌మెంట్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ స్వరూప్‌నగర్ సెవెన్ హిల్స్ కాలనీలో అర్జున్ శ్రీనివాసం అపార్ట్‌మెంట్‌లో ఉండే సంగ శ్రీదేవి అనే మహిళ అదే ప్రాంతంలో నివసించే ఒక మహిళకు ఇల్లు అద్దెకు ఇచ్చింది. శ్రీదేవి డిల్లీలో ఉంటుండగా ఇంటి బాధ్యతలను వారి బంధువు శివకుమార్ చూసుకుంటున్నాడు. అయితే గత కొద్ది రోజులుగా అద్దెకు ఉంటున్న మహిళకు, అపార్ట్ మెంట్‌వాసులతో గొడవలు జరుగుతున్నాయి. అపార్ట్‌మెంట్ లో క్షుద్ర పూజలు చేస్తున్నారని అపార్ట్‌మెంట్‌వాసులు ఆరోపిస్తుండగా, అద్దెకు ఉండే మహిళ అపార్ట్‌మెంట్‌వాసులను పోలీసులతో కలిసి బెదిరించి తప్పుడు కేసులు పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే క్రమంలో అపార్ట్‌మెంట్ వాసులంతా కలిసి కొద్ది రోజుల క్రితం పోలీసులకు పిర్యాదు చేశారు. సివిల్ వివాదం అని చెప్పి పోలీసులు పక్కన పెట్టినట్లు వారు పేర్కొంటున్నారు. కాగా అద్దెకు ఉండే మహిళ ఇంటి విద్యుత్ సరఫరాను తొలగించడం, ఆమెను ఇల్లు ఖాళీ చేయాలని ఒత్తిడి తీసుకుని రావడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. దీంతో అదే అపార్ట్‌మెంట్‌లో ఉండే కొర్కిశాల రాకేష్‌రెడ్డి (40) కూడా వెళ్లడంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. అసోసియేషన్ తరపున వెళ్లిన వ్యక్తులపై కేసులు నమోదు చేయడం ఏమిటని పలువురు ఆందోళనకు దిగారు. అప్పటికే ఆనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కొర్కిశాల రాకేష్ రెడ్డి చికిత్స కోసం ఆసుపత్రిలో చేరాడు. శుక్రవారం తెల్లవారుజామున మరణించాడు. అద్దెకు ఉండే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ కోసం పిలిచిన ఎస్సై చిరంజీవి వత్తిడి వల్లే రాకేష్ రెడ్డి మరణించాడని ఆరోపిస్తూ అపార్ట్‌మెంట్ వాసులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని పోలీసులను కోరారు. అపార్ట్‌మెంట్‌లో గుమ్మడికాయలు, నిమ్మకాయలు, పసుపు కుంకుమతో మాయ మంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. అద్దెకు ఉండే మహిళ ఇంటిపై స్థానికులు దాడికి దిగడంతో ఉప్పల్ సిఐ భాస్కర్, రామలింగారెడ్డి, ఇతర సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అద్దెకు ఉండే మహిళను మరో ప్రాంతానికి తరలించారు. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఉప్పల్ డిఎస్ఎల్ మాల్‌లో అతిఎత్తైన శాంటా క్లాజ్



**ఉప్పల్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** ఉప్పల్ డిఎస్ఎల్ మాల్‌లో క్రిస్మస్ సందర్భంగా సుమారు 60 అడుగుల క్రిస్మస్ చెట్టు, నగరంలోనే అతిపెద్ద 70 అడుగుల శాంటా అవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిఎస్ఎల్ మాల్ సంస్థ చైర్మన్ మనోజ్ అగర్వాల్ మాట్లాడుతూ నగరంలోనే అతి ఎత్తైన శాంటాను ఉప్పల్ డిఎస్ఎల్ మాల్‌లో అవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇది నగరాన్ని మరింత ప్రకాశవంతం చేస్తుందన్నారు. డిఎస్ఎల్ మాల్‌లో ఇప్పటికే అనేక మంది ప్రజలు దీనిని సందర్శించారని, మాల్‌లో పండుగ వాతావరణం నెలకొందన్నారు. డిఎస్ఎల్ వర్చువల్ మాల్ వినియోగదారులకు అనేక రకాల సేవలు అందిస్తుందని తెలిపారు.

## మహిళ రైతులు ఆర్థికంగా ఎదగాలి



**అత్తాపూర్ డిసెంబర్ 19,ప్రభాతవార్త :** మహిళ రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు కోళ్ల పెంపకం ఉపయోగపడుతుందని పి.వి.నరసింహ రావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ పరిశోధన నిర్దేశకులు డాక్టర్.సి.హెచ్ హరి కృష్ణ అన్నారు. ఐకార్(ఐసిఏఆర్) ఎస్‌సి సబ్ ప్లాన్ కింద,వై.ఎఫ్ఏ కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయంతో వనపర్తి జిల్లాకు చెందిన షెడ్యూలు కులాల మహిళ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చే రాజశ్రీ పెరటి కోళ్ల పెంపకం పట్ల మహిళలు ఆసక్తి చూపాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డా.కృష్ణ దైడ మాట్లాడుతూ...పెరటి కోళ్ల రంగంలో ఉన్న నూతన వాణిజ్య అవకాశాల గురించి వివరించారు. ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్ పవన్, డా రామకృష్ణ, వైఎఫ్ఎకెవికె మదనపురం నిపుణులు డా.భవాని మహిళ రైతులకు రాజశ్రీ కోడి జాతి ప్రత్యేకతలను వివరించారు.

### వాతావరణ కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన



బోడుప్పల్ జిల్లా పరిషత్ హైస్కూల్ లో శక్తి వనరులు, పొదుపు, వాతావరణ కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ రావు

**బోడుప్పల్ డిసెంబర్ 19 ప్రభాతవార్త :** హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ లో బోడుప్పల్ జిల్లా పరిషత్ హైస్కూల్ లో డిప్యూటీ కమీషనర్ ఏ. శైలజా అనుమతి తో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సెయింట్ ఆన్స్ పి. జీ. కాలేజీ ప్రిన్సిపాల్ జెస్సి, డాక్టర్ సౌజన్య,డాక్టర్ శ్రీనివాస్, పి. జీ. విద్యార్థులు లతో హైస్కూల్ విద్యార్థులకు శక్తి వనరుల వాడకములో పొదుపు,వాతావరణ కాలుష్యం పై అవగాహన కల్పించడం జరిగినది. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేయడం జరిగినది. అదే విధముగా జిల్లా పరిషత్ స్కూల్ కు 20 ఎల్. ఇ. డి. లైట్స్ హెడ్ మాస్టర్‌కు అందచేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మునిసిపల్ కమీషనర్ ఇ. శ్యామ్ సుందర్ రావు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ భార్గవి, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జ్‌లను కలిసిన చంద్రశేఖర్



**నేరేడ్‌మెట్, డిసెంబర్ 19,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్‌లు మీనాక్షి నటరాజ్, విశ్వనాథ్‌తో పాటు ఏఐసీసీ నేత సచిన్‌ను నేరేడ్‌మెట్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి. చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, పార్టీ కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యలపై పార్టీ చేపడుతున్న కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా నేరేడ్‌మెట్ ప్రాంతంలో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలు పంచుకున్నారు. పార్టీ విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లు సూచించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న పి. చంద్రశేఖర్‌ను వారు అభినందించగా, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి మరింత మద్దతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### కాల బైరవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూజలు



ఉప్పల్ శ్రీ కాల బైరవస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** ఉప్పల్ బాగాయత్ లోని శ్రీ కాల బైరవస్వామి ఆలయంలో శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా జరిగిన పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శ్రీ కాలబైరవస్వామి దయతో ఉప్పల్ నియోజకవర్గం ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయంలో భక్తులకు తగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

### రామంతాపూర్‌లో పార్కుల అభివృద్ధికి చర్యలు



రామంతాపూర్ ప్రగతినగర్ పార్కు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ పార్కు అభివృద్ధి పనులను మున్సిపల్ డిఇ నాగమణి, ఎఇ మౌనిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తదితరులతో కలిసి సందర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పార్కులలో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పార్కులను సుందరీకరణ చేసి వాకింగ్ ట్రాక్‌లు, వృద్ధులకు కుర్చీలు, బెంచీలు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రగతినగర్‌లో మూడు పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఆర్.కృష్ణమూర్తి, డి. కామేశ్వర రావు, దేవ, ప్రవీణ్ గౌడ్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

### వినాయకహిల్స్‌లో పర్యటించిన బడంగ్‌పేట్ ఇంఛార్జి డిసి



బడంగ్‌పేట్ ఇంఛార్జి డిసి సరస్వతికి సమస్యలు వివరిస్తున్న అల్మాస్‌గూడ వినాయకహిల్స్ ఫేస్-1 కాలనీవాసులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి 57 డివిజన్ పరిధిలోని అల్మాస్‌గూడ వినాయకహిల్స్ ఫేస్-1 కాలనీలో శుక్రవారం బడంగ్‌పేట్ సర్కిల్ ఇంఛార్జి డిప్యూటీ కమీషనర్ సరస్వతి పర్యటించారు. కాలనీకి చెందిన పలు సమస్యలను స్థానిక కాలనీవాసులు ఎఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘువేందర్‌రెడ్డి దృష్టికి తేవడంతో ఆయన డిసికి వివరించారు. ఈ నేపథ్యంలో ఆమె ఎఇఇ హరీష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరిలతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిష్కరిస్తామని ఆమె కాలనీవాసులకు హామీనిచ్చారు. తమ వినతికి సానుకూలంగా స్పందించిన రాఘవేందర్‌రెడ్డికి, డిసి సరస్వతికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

### రామంతాపూర్‌లో ప్రజావాణి సంస్థ ఆవిష్కరణ



ప్రజావాణి సంస్థ బ్రోచర్ అవిష్కరిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి, ఎస్ఐ మమత, ఎర్రం శ్రీనివాస్ తదితరులు

**రామంతాపూర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థను స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి, ఎస్ఐ మమత అవిష్కరించారు. సంస్థ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సంస్థ విద్య ,ఆరోగ్యం ,పర్యావరణం మరియు ఇతర సామాజిక అంశాలపై పనిచేస్తుందని తెలిపారు. కొత్తగా ఏర్పడిన ఈ సంస్థ ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేశారని, ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు, యువత మత్తు ప్రదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ నివారణ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు చిరు తిండ్లు మానివేయాలని, బయట ఆహారానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సంస్థ బ్రోచర్ అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి విజయకుమార్, సూరం రాంరెడ్డి, రవీందర్ రావు, గోలి కృష్ణయ్య ,రఘు ప్రకాష్, జిల్లా కిరణ్ కుమార్ ,శంకర్ గౌడ్, రాజు గౌడ్, పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ




చిలుకానగర్‌లో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ జి.రాజు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

**ఉప్పల్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** లయన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహపురి ఆధ్వర్యంలో శుక్రవారం చిలుకానగర్‌లో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ డిప్యూటి కమిషనర్ జి.రాజు, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ లయన్ మనోహర్‌రాజు, క్లబ్ అధ్యక్షులు శ్రీధర్, కార్యదర్శి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు నిత్యం అనేక ఇబ్బందులు పడుతూ రోడ్లపై పనిచేస్తుంటారని, వారికి తగు చేయూత అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కొందరు కార్మికులు ఉదయం ఉద్యోగం చేస్తూ సాయంత్రం పిల్లలకు చదువులు చెబుతున్నారని, ఇటువటీ వారి సేవలు ఆదర్శనీయమన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహపురి డైరెక్టర్లు పుల్లారావు, సుధాకర్ రెడ్డి, సుబ్బారావు, ఎ.వి.ప్రసాద్, సదానందం, మహేశ్, జార్జ్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## శివశంకర మహామాయి ఆలయంలో ప్రత్యేక పూజలు



శ్రీ శివ శంకరమహామాయి ఆలయంలో అన్నదానం చేస్తున్న ఆలయ కమిటి నేతలు యు.బి.చారి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని శ్రీ శివ శంకర మహా మాయి దేవాలయంలో శుక్రవారం మార్గశిర అమావాస్య సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమావాస్య సందర్భంగా ప్రతి నెల ఆలయంలో పూజలు చేస్తామని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సభ్యులు ఉప్పొజి బలవంత చారి, బిక్షపతి, రాజగోపాల చారి, శ్రీనివాస్, మధు, పవన్, చోల్లేటి శ్రీనివాస్, శ్రీధరా చారి, పల్లేర్ల గోపి, జి.శ్రీనివాస్ శర్మ, శామీర్ పేట హనుమంత్ రెడ్డి, బజార్ జగనాదంజ్ గౌడ్, కృష్ణారెడ్డి, పాలకుర్తి ప్రవీణ్, కృష్ణ రెడ్డి, జగన్, ఏసూరి యాదగిరి, పూడూరు కృష్ణారెడ్డి, నవీన్, ముదుగొండ రవి, శ్రీనివాస్, గుండాల అనిల్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, నర్సింహా చారి, రావు,నర్సింగ్ రావు, తురాయి దాస్, మహేష్, జగన్, బిక్షపతి, రామ్ ప్రకాష్, గోపి చారి, పసుపు నేటి రమేష్, వెంకటయ్య, కుమార్, భాస్కరచారి, బూత్కురి సాయి కుమార్ గౌడ్, నవీన్ గౌడ్, పాపయ్యగౌడ్, రాజు, సందీప్, మహేష్ కుమార్, భవాని శంకర్, లక్ష్మణ్, సంతోష్ కుమార్, బంటి, శ్రీను, శ్రీనివాస్ గౌడ్, గణేష్ గౌడ్, యాది గౌడ్, వెంకటేష్, పాల్గొన్నారు.

### మానవ హక్కుల కౌన్సిల్ మెంబర్‌గా సత్తు శ్రీను ఎన్నిక



మానవ హక్కుల కౌన్సిల్ మెంబర్ సత్తు శ్రీను

**ఉప్పల్ డిసెంబరు 19 ప్రభాతవార్త :** హెడ్ వరల్డ్ మానవ హక్కుల కౌన్సిల్ పాన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా సత్తు శీను నియమితులైయ్యారు. ఈ మేరకు శుక్రవారం హబ్సిగూడలోని సంస్థ చైర్మన్ మాధ్ నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సత్తు శ్రీను మాట్లాడుతూ ఎపి, తెలంగాణ రాష్ట్రాలలో కార్యకలాపాలు కొనసాగిస్తున్న హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు తనను ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. తనపై నమ్మకంతో చైర్మన్ మాధవ్, ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండలకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. బాధితులకు అండదండగా ఉంటానని. బాధితులకు న్యాయం లభించే లాగా పోరాటం చేస్తానని పేర్కొన్నారు. హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరపున మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను ఘనంగా సత్కరించారు.



బాలాపూర్ గ్రామంలో బిఆర్ఎస్‌కు చెందిన వంగేటి లక్ష్మీ లక్ష్మారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన అయ్యప్ప పడి పూజకు హాజరైన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి